



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- హెల్మెట్ ధారణను అలవాటుగా మార్చుకోవాలి
- అవగాహన సదస్సులో జిల్లా న్యాయాధికారి పిలుపు

ఖిల్లా, ఆగస్టు 28: జిల్లాను ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సింగనెవార్‌లు పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ శాఖ, న్యాయసేవాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ట్రాఫిక్ నిబంధనలు, ప్రత్యేకించి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరేడ్ గ్రౌండ్ నుంచి కోర్టు కాంప్లెక్స్ చౌరస్తా వరకు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. జిల్లా న్యాయాధికారి, కలెక్టర్, సీపీలు సైతం హెల్మెట్‌లు ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే నష్టాల గురించి పోలీస్ కళాజాతా బృందం సభ్యులు పాటలు, ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులు కూడా నేరస్థులుగా పరిగణించబడుతారని తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే 90 శాతం వరకు ప్రాణాపాయం బారినుంచి తమను తాము కాపాడుకునేందుకు ఆస్కారం ఉంటుందని కలెక్టర్ సూచించారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. దేశంలో రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి గంటకు 19 మంది మృత్యువాత పడుతున్నారని జిల్లాలో గత ఏడాది 337 మంది, ఈ యేడాది ఇప్పటికే 218 మంది ప్రాణాలు కోల్పోయారని వీరిలో ద్విచక్ర వాహనదారుల సంఖ్య అధికంగా ఉందని గణాంకాలతో సహా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా సెషన్స్ జడ్జిలు కనకదుర్గ, టి.శ్రీనివాస్, ఆశలత, సీనియర్ సివిల్ జడ్జిలు ఎం.శ్రీకాంత్‌బాబు, పి.పద్మావతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.గోపికృష్ణ, అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు కుష్బూ ఉపాధ్యాయ్, టి.శ్రీనివాస్‌రావు, మెజిస్ట్రేట్‌లు వి.హరికుమార్, చైతన్య, అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఎంవీఐ కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.





కొత్త రేషన్ కార్డులపై ఆశలు



- మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుతో దరఖాస్తుదారుల్లో చిగురిస్తున్న ఆశలు
- రేషన్ కార్డుల కోసం ఏళ్లుగా ఎదురు చూపులు
- మార్పులు, చేర్పుల కోసం వేలల్లో దరఖాస్తులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 28: కొత్త రేషన్ కార్డుల మంజూరు దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న దరఖాస్తుదారుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. పేద, మధ్యతరగతి వర్గాల వారు ఎన్నో ఏళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం అర్హులందరికీ తెల్ల రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయడంతో మళ్లీ కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం 3లక్షల 80వేల 56 ఆహార భద్రత కార్డులు ఉండగా 12లక్షలకు పైగా లబ్ధిదారులకు ప్రతినెలా రేషన్ షాపుల ద్వారా రేషన్ పొందుతున్నారు. ఆరేళ్లుగా కొత్త కార్డుల జారీ నిలిచిపోగా ఉన్న కార్డుల్లో కొత్తవారిని చేర్చడానికి, ఉన్నవారిని తొలగించడానికి అవకాశం లేకుండాపోయింది. గతంలో మీసేవ కేంద్రాల ద్వారా రేషన్ కార్డులలో సభ్యులను చేర్చుకోవడం, తొలగించడం చేశారు. కానీ దానిని గత ప్రభుత్వం నిలిపివేయడంతో అనేక మంది కార్డులలో తమ పేర్లను చేర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయన్న ఆశతో ఉమ్మడి కుటుంబం లోని కార్డు నుంచి తమ పేర్లను తొలగించుకోగా మరికొంత మంది పెళ్లిళ్లు జరిగి పుట్టింటిలోని కార్డులలో పేర్లను తొలగించుకున్నారు. వారికి అత్తగారింట్లో ఉన్న కార్డులో పేరు జోడించాలని దరఖాస్తు చేసుకున్నప్పటికీ పుట్టింట్లో తొలగిపోయి మెట్టినింట్లో చేర్చలేక వారికి అర్హులైనప్పటికీ బియ్యం రావడం లేదు. అటు బియ్యం రాక ఇటు కొత్త కార్డులో పేరు నమోదు కాక అనేక ప్రభుత్వం సంక్షేమ పథకాలను పొందలేకపోతున్నారు.

జిల్లాలో 3,80,056 ఆహార భద్రత కార్డులు

జిల్లాలో 3లక్షల 80వేల 56 ఆహార భద్రత కార్డుల ద్వారా ఇప్పటికే 12లక్షల 25,012 మంది లబ్ధిదారులకు అంత్యోదయ, అన్నపూర్ణ కార్డుల ద్వారా రేషన్ అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 759 రేషన్ దుకాణాల ద్వారా రేషన్ సరకుల పంపిణీ కొనసాగుతోంది. జిల్లాలో అంత్యోదయ కార్డులు 20927 ఉండగా 56వేల 880 మందికి, 1034 అన్నపూర్ణకార్డుల ద్వారా 1057 మందికి, మొత్తం 4లక్షల 2వేల 17 మంది లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందజేస్తున్నారు. వీరికి ప్రతి నెలా ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున, అన్నపూర్ణ కార్డుదారులకు ఉచితంగా 10కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు ప్రతి నెలా 35 కిలోల బియ్యాన్ని అందజేస్తున్నారు.

విధానాల రూపకల్పనలో..

విధానాల రూపకల్పనలో ప్రభుత్వం నిమగ్నమైంది. తెల్ల రేషన్‌కార్డు జారీకి గ్రామీణ ప్రాంతంలో రూ.లక్షా 50వేల లోపు వార్షిక ఆదాయం, మాగాణి 3.5 ఎకరాలు, చెలక 7.5 ఎకరాలు, పట్టణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం 2లక్షలలోపు ఉండాలని ప్రతిపాదనలకు ప్రజా ప్రతినిధుల నుంచి సలహాలు సూచనలు తీసుకోవాలని మంత్రివర్గ ఉపసంఘం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో కొత్త రేషన్ కార్డుల జారీకి మార్గదర్శకాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

పేర్ల నమోదు, సవరణలకు 96వేల దరఖాస్తులు పెండింగ్

జిల్లాలో ప్రస్తుతం 3లక్షలకు పైగా ఉన్న రేషన్‌కార్డులలో సవరణలు, కుటుంబ సభ్యులను చేర్చడానికి లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులు 96వేలు పెండింగ్‌లో ఉన్నాయి. రేషన్ కార్డులు జారీ చేసిన కొత్తలో చిన్న పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లడంతో వారికి ప్రభుత్వం ద్వారా సహాయం అందుతుండటంతో వారి పేర్లను రేషన్ కార్డులలో చేర్చుకోలేదు. ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు, ఆరోగ్యశ్రీ పథకానికి ఇతర ప్రభుత్వ పథకాలకు ఆహార భద్రత కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో అర్హులైనప్పటికీ అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. కొత్త కార్డులు ఎప్పుడు వస్తాయని కొత్తగా పెళ్లైన జంటలు ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. పెళ్లై పిల్లలు కలిగినా కొత్త కార్డుల జారీ ప్రక్రియ జరగకపోవడంతో ఎంతో మంది నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం కొత్తగా గత ఆరేళ్లకు పైగా రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి ఉంటున్నవారు, కొత్తగా పెళ్లైన వారు కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు.



● బోధన్ మండలంలో పొలంబాటలో పాల్గొన్న ఎన్‌పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది

కర్షకుల వద్దకే.. కరెంటోళ్లు!

- అక్కడికక్కడే కరెంటు సమస్యల పరిష్కారం
- విద్యుత్ కార్యాలయాల్లో కంజుమర్ రెసెప్షన్ డెస్కులు
- మెరుగైన కరెంట్ సరఫరాకు పలు సంస్కరణలు

బోధన్‌రూరల్, ఆగస్టు 28: విద్యుత్ సంస్థ మెరుగైన సేవలు అందించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోంది. వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారంతో పాటు ఉద్యోగుల్లో జవాబుదారితనం తీసుకువచ్చే దిశగా పలు సంస్కరణలు తీసుకువచ్చింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం, వ్యవధిని కనిష్ఠ స్థాయికి తీసుకురావడంతో పాటు వైఫల్యాల స్థాయిని కూడా సాధ్యమైనంత మేరకు తగ్గించేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో మానిటర్నింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి ఫీడర్‌ల వైఫల్యాలు, విద్యుత్ సరఫరాలో అంతరాయం, వ్యవధితో పాటు ఒక్క రోజులో ఎన్నిసార్లు కరెంటు పోతుందో సంబంధిత అధికారులు కారణాలను నమోదు చేస్తున్నారు. అవి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలు కొనసాగుతున్నాయి. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించడానికి విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహిస్తున్నారు. కంజుమర్ రిసెప్షన్ డెస్కులను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కొత్తగా పొలాల వద్దకే విద్యుత్ అధికారులు వెళ్లి పొలంబాట కార్యక్రమాన్ని గత బుధవారం నుంచి జిల్లా, బోధన్ డివిజన్ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.

పొలంబాట

గ్రామాల్లో రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఓ కొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. దాని పేరు విద్యుత్ అధికారుల పొలంబాట. రైతుల విద్యుత్ సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు ఉద్దేశించిన ఈ వినూత్న కార్యక్రమం ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని బోధన్ డివిజన్‌లో అమలులోకి వచ్చింది. బోధన్ డివిజన్‌లోని అన్ని మండలాల్లో పొలంబాట కార్యక్రమాన్ని చేపడుతున్నారు. కరెంట్ సమస్యపై రైతులను అడిగి తెలుసుకుంటున్నారు. వారి సమక్షంలోనే పరిష్కరిస్తున్నారు. అవసరమైతే వారి సహాయాన్ని కూడా తీసుకుంటున్నారు. కరెంట్ సమస్యపై రైతులను అడిగి తెలుసుకుంటున్నారు. వర్షాకాలంలో కరెంట్ సమస్యలు అధికంగా ఉంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని సీఎండీ ఈ పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఇది పక్షం రోజుల పాటు కొనసాగుతుంది. అవసరమైతే ఆ తర్వాత కూడా మరికొన్ని రోజుల పాటు కొనసాగించే అవకాశం ఉంది.

సత్వర పరిష్కారం

అన్నం పెట్టే అన్నదాతకు సమస్యలు వస్తే పనులు మానుకోవాల్సిన పరిస్థితిని విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమం ద్వారా నివారించనుంది. విద్యుత్ సంస్థ అధికారులైన ఎస్ఈ, డీఈ, ఏఈ, విద్యుత్ సిబ్బంది పొలంబాట నిర్వహిస్తున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు, విద్యుత్ లైన్‌మెన్, ఇన్‌స్పెక్టర్ల నెంబర్‌లకు ఎన్‌పీడీసీఎల్ టోల్‌ఫ్రీ నెంబర్‌ను అందజేస్తున్నారు.

కంజుమర్ కనెక్షన్ డెస్క్ ఏర్పాటు

క్షేత్రస్థాయిలో వినియోగదారులకు సేవలు అందించే సెక్షన్ కార్యాలయాలకు వినియోగదారుడు వెళ్లి వారి సమస్య అడిగి తెలుసుకోవడానికి సరైన వ్యవస్థ లేదు. సెక్షన్ అధికారి అయిన ఏఈ ఉంటేనే సమస్యను నివేదించేవారు. సబ్ ఇంజనీర్‌లు క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్న ఏఈ వినియోగదారుడి చెప్పి పంపించేవారు. ఈ దుస్థితిని నివారించడానికి ప్రస్తుతం కంజుమర్ కనెక్షన్ డెస్క్‌ను బోధన్‌లో ఏర్పాటు చేశారు.

పొలంబాటకు విశేష స్పందన..

: ముక్తార్ హైమద్ (డీఈ బోధన్ ట్రాన్స్‌కో)

విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమానికి రైతుల నుంచి అపూర్వ స్పందన లభిస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరి చేస్తున్నాం. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు డీటీఆర్‌ల ఎత్తును పెంచుతున్నామన్నారు. కింది వేలాడుతున్న కరెంట్ వైర్లను గట్టిగా బిగిస్తున్నామని విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మోటార్లు సామర్థవంతంగా పని చేసేందుకు కెపాసిటర్లు బిగించాల్సిన అవసరాన్ని రైతులకు వివరిస్తున్నామన్నారు. విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమంలో భాగంగా ఏ రోజు ఏ గ్రామానికి వెళ్లేది రైతులకు ముందే సమాచారాన్ని అందిస్తున్నామన్నారు.



● ప్రతిమకు రంగులు అద్దుతున్న రాజస్థాన్ కళాకారుడు

ముస్తాబవుతున్న వినాయక ప్రతిమలు

ప్రతిమలకు తుది మెరుగులు ● గణనాథుల తయారీలో రాజస్థాన్ కళాకారులు


ఆర్మూర్ రూరల్, ఆగస్టు 28: మరో పది రోజుల్లో రానున్న వినాయక చవితి పర్వదినానికి వినాయక ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. ప్రతిమల తయారీలో రాజస్థాన్ కార్మికులు నిమగ్నమయ్యారు. గణపతి ప్రతిమలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. గణేష్ మండళ్ల నిర్వాహకులు తమకు నచ్చిన వాటిని కొనుగోలు చేయడానికి అడ్వాన్స్ ఇచ్చి బుక్ చేసుకుంటున్నారు. ఆర్మూర్ పట్టణంలోనే సుమారు 20కి పైగా వినాయక ప్రతిమల తయారీదారులు ఉన్నారు. ఆర్మూర్, నిజామాబాద్ పట్టణాల్లో 12ఫీట్ల ఎత్తు వరకే వినాయకులను తయారు చేస్తుంటారు. ఈయేడు భారీ విగ్రహాలను సైతం ఆర్మూర్‌లో తయారు చేయడం విశేషం. ఇటీవలి వరకు భారీ విగ్రహాలను కోరుట్ల, హైదరాబాద్ నుంచి కొనుగోలు చేసి తీసుకువచ్చేవారు. ప్రతిమల తయారీదారులు ఎక్కువ కావడంతో లాభాలు క్షీణిస్తున్నాయని విగ్రహాల తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం చాలా వరకు వినాయక ప్రతిమలు మిగిలిపోయాయని, దానివల్ల తమకు నష్టమే మిగులుతోందని వారంటున్నారు. ఒక్కో షెడ్డులో సుమారు వందకుపైగా విగ్రహాలను తయారు చేస్తున్నారు. గత సంవత్సరంతో పోల్చితే ఈయేడు వినాయకుల ప్రతిమలకు ధరలు తక్కువగానే ఉన్నాయి. దీనికితోడు పోటాపోటీగా గణపతులను తయారు చేయడంతో ఆశించిన లాభాలు రావడం లేదని వారు వాపోతున్నారు.



ఆశించినస్థాయిలో లాభాలు రావడంలేదు : మధు (ప్రతిమల తయారీదారుడు)

ఐదేళ్ల నుంచి వినాయక ప్రతిమలను తయారు చేయిస్తున్నప్పటికీ ఆశించినస్థాయిలో లాభాలు రావడంలేదు. ఖర్చులు అధికంగా కావడం, ముడిసరుకుల ధరలు, అచ్చుల అద్దె, తదితర వాటికి డబ్బులు అధికంగానే చెల్లించాల్సి వస్తోంది. గత సంవత్సరం వినాయక ప్రతిమలు పూర్తిస్థాయిలో అమ్మకాలు జరగక కొన్ని మిగిలిపోవడంతో నష్టాలే మిగిలాయి. పోటీ ఎక్కువ కావడంతో గిరాకీలు తగ్గాయి. ఈ సంవత్సరం ఎంత కొంత లాభాలు వస్తాయని ఆశిస్తున్నాం.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు తగ్గిన వరద



● కాకతీయ కాలువకు ప్రవహిస్తున్న నీరు

మెండోర, ఆగస్టు 28: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో మూడు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టులోకి వరద తగ్గిందని, ప్రాజెక్టులోకి 7533క్యూసెక్కుల వరదనీరు స్వల్పంగా వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఏఈఈ వంశీ తెలిపారు. ఉదయం ప్రాజెక్టులోకి 21516 క్యూసెక్కుల వరద నీరు చేరగా మధ్యాహ్నం ప్రాజెక్టులోకి 10977క్యూసెక్కుల వరద తగ్గింది. సాయంత్రానికి ప్రాజెక్టులోకి 7533క్యూసెక్కుల వరద కాస్త తగ్గుముఖం పట్టింది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్టు నుంచి వానాకాలం పంటల కోసం కాకతీయ, లక్ష్మీ, సరస్వతి కాలువలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3వేల క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 500క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 578 క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి కోసం 231క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీ)లు కాగా, బుధవారం సాయంత్రానికి 1084.9 అడుగులు (59.501 టీఎంసీ)ల నీటి నిల్వ ఉంది. గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్టులో 1090.60అడుగులు (78.868టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని తెలిపారు.

వసతి గృహాన్ని పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి

ఇందల్వాయి, ఆగస్టు 28: ఇందల్వాయి మండల కేంద్రంలోని బాలుర వసతిగృహాన్ని బుధవారం జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ పరిశీలించారు. ఆయన అధికారులతో మాట్లాడుతూ పారిశుధ్య పనుల పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలని సూచించారు. ఇటీవల సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, తదితర వ్యాధులు గ్రామాల్లో ఎక్కువ అవుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపిడివో అనంత్‌రావు, ఎంపివో రాజ్‌కాంత్, పంచాయతీ కార్యదర్శి భరత్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ జితేందర్, తదితరులు ఉన్నారు.

సైనిక్ క్యాంపునకు గిరిరాజ్ విద్యార్థి

నిజామాబాద్‌అర్బన్, ఆగస్టు 28: ఎన్‌సీసీలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన తల్ సైనిక్ క్యాంప్‌కు జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బండు నాయక్ ఎంపికయ్యాడు. ప్రస్తుతం గిరిరాజ్ కళాశాలలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న బండు నాయక్ ఈయేడాది నిర్వహించే తల్ సైనిక్ క్యాంప్‌కు మన జిల్లా నుంచి ఒక్కడే ఎంపికయ్యాడు.

'పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి'

బోధన్‌రూరల్, ఆగస్టు 28: పాత పింఛన్ విధానంను ప్రభుత్వం పునరుద్ధరణ చేయాలని టీచర్స్‌యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సలీం అన్నారు. బుధవారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఇష్టం లేని ఏకీకృత పింఛన్ విధానాన్ని స్టేట్ యూనియన్ వ్యతిరేకిస్తుందని, కావున పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిషోర్‌లతో నాయకులు బాలచంద్రం, జిల్లా కార్యవర్గ సభ్యులు వై.శ్రీనివాస్ రావు, యుసుఫ్, ప్రసాద్, శ్రీనివాస్, వహీద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లిలో సైబర్ నేరాలపై అవగాహన

ఎడపల్లి, ఆగస్టు 28: మండలంలోని సాటాపూర్ గేటు వద్ద బుధవారం ఎడపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ప్రజలకు సైబర్‌నేరాలపై, హెల్మెట్‌ధారణపై ఏఎస్సై ఇలియాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఫోన్‌లో గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలను ఇతరులకు చెప్పవద్దని, పోలీస్ అధికారుల డీపీతో ఫోన్‌చేసి మీ కుటుంబం వారు వివిధ నేరాల్లో ఉన్నారని చెప్పి డబ్బులు కట్టమని సైబర్ నేరగాళ్ళు కొత్త అవతారం ఎత్తారని ఆయన తెలిపారు. పోలీసులు ఎవరు కూడా డబ్బులు డిమాండ్ చేయరని, అలాంటి కాల్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. రోడ్డుప్రమాదంలో అధికంగా తలపగిలి చనిపోతున్నారని, అలా జరుగకుండా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. హెల్మెట్ లేకుండా ఎవరైనా బండి నడిపితే 5 రోజుల వరకు బండి సీజ్ చేయబడుతుందని, ఆ తరువాత ఆర్టీవో కార్యాలయంలో ఫైన్‌కట్టిన తరువాత బండి ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు. కావున ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పోలీస్ కానిస్టేబుళ్ళు తదితరులు ఉన్నారు.

రైతుల ఇంటికే వెళ్లి కుటుంబసభ్యుల నిర్ధారణ చేస్తాం

● మండల వ్యవసాయ అధికారి సిద్దిరామేశ్వర్

ఎడపల్లి, ఆగస్టు 28: కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉండి రుణమాఫీ కాని రైతుల జాబితా ప్రకారం ఆయ గ్రామాలలో వారి ఇంటికి వెళ్ళి పరిశీలించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి, రుణమాఫీ నోడల్ అధికారి సిద్ది రామేశ్వర్ తెలిపారు. తేది 28, 29న ఠానాకలాన్, 30, 31న జైతాపూర్, సెప్టెంబర్ 2, 3న ఎడపల్లి, 4న మంగల్‌పాడ్, 5న కుర్నాపల్లి, 6న బ్రాహ్మణ్‌పల్లి గ్రామాలలో రైతుల ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేస్తామని తెలిపారు. అలాగే 7న గ్రామం విడిచి వెళ్ళిన రైతులు, 8, 9న మండల బయటి గ్రామాల రైతుల కుటుంబ వివరాలను పరిశీలించి నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందన్నారు. రైతులు ఇందుకు సహకరించాలని ఆయన కోరారు.

'అమరవీరుల పోరాట స్ఫూర్తితో పోరాడుదాం'

బోధన్‌రూరల్, ఆగస్టు 28: విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం పోరాడుదామని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు మల్లేష్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని తట్టికోటలో 2000 సంవత్సరంలో విద్యుత్ ఉద్యమంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డిల సంతాప సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదే పోరాట స్ఫూర్తితో నేడు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల అమలుకై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు పడాల శంకర్, సాయిలు, పోశెట్టి, పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు నాగమణి, కవిత, అరుణ, లక్ష్మి, వెంకటమ్మ, రాము, రాజు, శ్రీనివాస్, గంగాధర్, నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దబజార్ : పోరాట స్ఫూర్తితో ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ భారాలు మోపడానికి వెనుకడుగు వేయడం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ సమావేశం నిర్వహించి విద్యుత్ పోరాట అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పోరాటం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుజాత, విఘ్నేష్ పాల్గొన్నారు.

నవీపేటలో వేంకటేశ్వర స్వామి పల్లకీ సేవ

నవీపేట, ఆగస్టు 28 : మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం శ్రీ వేంకటేశ్వర స్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్ల పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వర ఆలయం నుంచి హనుమాన్ మందిరం వరకు దేవతమూర్తులను పల్లకిలో ఊరేగించారు. ప్రతి సంవత్సరం కృష్ణాష్టమి మరుసటి రోజున దేవతమూర్తులకు పల్లకిసేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

పెళ్లి భోజనంలో 'ముక్కల' లొల్లి!

● మటన్ ముక్కలు తక్కువగా వచ్చాయని వరుడి బంధువుల గొడవ
● పరస్పరం రాళ్లు, కర్రలతో దాడులు ● 8మందికి గాయాలు


ఇరుపక్షాల దాడిలో గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నవీపేట, ఆగస్టు 28 : అప్పటి వరకు ఆ వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. వధూవరులను పెళ్లికి వచ్చిన అతిథులు నిండు మనస్సుతో ఆశీర్వదించారు. ఇప్పటివరకు బాగానే ఉన్నా.. ఆ తర్వాత మొదలైంది 'ముక్కల' లొల్లి. భోజనంలో మటన్ ముక్కలు తక్కువ వచ్చాయంటూ జరిగిన గొడవలో ఇరు పక్షాలకు చెందిన ఎనిమిది మందికి గాయాలైన ఘటన నిజామాబాద్ జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..

జిల్లాలోని నవీపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల కేంద్రానికి చెందిన వధువుకు నందిపేట మండలంలోని బాద్గుణకు చెందిన వరుడితో పెళ్లి జరిగింది. తర్వాత జరిగిన పెళ్లి భోజనంలో తమకు మటన్, చికెన్ సరిగ్గా వడ్డించడం లేదని వరుడి తరుపు బంధువులు గొడవకు దిగారు. ముక్కలు తక్కువగా వేస్తున్నారంటూ పెళ్లికూతురు తరఫు బంధువులతో వాదనకు దిగారు. చిన్నగా మొదలైన గొడవ కాస్త ఒక్కసారిగా పెద్దగా మారింది. దీంతో అటు వధువు, ఇటు వరుడు తరఫునకు చెందిన వారు ఒకరినొకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. అంతటితో ఆగకుండా కర్రలు, రాళ్లతో పరస్పరం దాడులకు దిగారు. ఈ ఘటనలో ఇరు పక్షాలకు చెందిన 8మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని మొదట నవీపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా.. ఫంక్షన్‌హాల్ బయట ఉన్న రోడ్డుపై సైతం ఇరు పక్షాలు దాడులు చేసుకుని న్యూసెన్స్ చేయడంతో అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రాజేష్ ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలకు చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చివేయాలి


నవీపేటలో తడగామ వద్ద రోడ్డుపై గుంత పడిన దృశ్యం

నవీపేట,ఆగస్టు28: నవీపేటలోని తడగామ చౌరస్తా వద్ద ప్రధాన రహదారి మధ్యలో భారీ గుంత ఏర్పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంత పెద్దదిగా మారగా వర్షపు నీరు గుంతలో నిలిచి పలుమార్లు ద్విచక్ర వాహనదారులు ప్రమాదం బారిన పడ్డారని స్థానికులు పేర్కొన్నారు. నవీపేట నుంచి నందిపేటకు నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయని వెంటనే సంబంధిత గుంతను పూడ్చివేసి ప్రమాదాన్ని నివారించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలో కొందరు కర్రను పాతి దానికి ప్లాస్టిక్ కవర్‌ను చుట్టారు. వెంటనే ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడ్డ గుంతను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్య లోపం : యార్లగడ్డ

రుద్రూరు, ఆగస్టు 28 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పారిశుధ్యం పేరుకు పోయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆర్ఎస్‌పీ పార్టీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కార్యదర్శి యార్లగడ్డ సాయిబాబా పేర్కొన్నారు. బుధవారం రుద్రూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో జిల్లాస్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించడం లేదన్నారు. గ్రామాల్లో ఉన్న వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో నెల కొన్న సమస్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బోధన్ డివిజన్ కార్యదర్శి బాలు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

రుద్రూరు, ఆగస్టు 28 : ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ రుద్రూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాండ్ల మధు, నీరడి నడిపి సాయిలు, సాయి కిరణ్, షేక్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై నేటి నుంచి ఇంటింటా సర్వే

వేల్పూర్, ఆగస్టు28: వేల్పూర్ మండల గ్రామాల్లో రైతులకు పంట రుణమాఫీ వర్తించకపోవడంతో గురువారం రైతుల ఇంటింటికి వెళ్లి సర్వే చేపడుతున్నట్టు మండల వ్యవసాయాధికారి శృతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డు లేకుండా రుణమాఫీ రాని కుటుంబాలను మొబైల్ యాప్‌లో గ్రూపింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 29న తేదీన మోతె గ్రామం, 30న వెంకటాపూర్, కుకునూర్, కోమన్‌పల్లి, 31న వేల్పూర్, సెప్టెంబర్ 2న జాన్కంపేట్, సాహెబ్‌పేట్, 3న అక్లూర్, 4న రామన్నపేట్, 5న అంక్సాపూర్, 6న కొత్తపల్లి, వాడి, 9నపచ్చలనడ్కుడ, 10న పడిగెల, పోచంపల్లి, 11నఅమీనాపూర్,లక్కోర గ్రామాల్లోజరుగుతుందని ఏవో తెలిపారు

రైతు భరోసా యాప్‌ను నమోదు చేసుకోవాలి

ముప్కాల్, ఆగస్టు28: రుణమాఫీ పథకంలో భాగంగా ఇప్పటి వరకు రుణమాఫీ కానీ రైతులు రైతు భరోసా యాప్ ద్వారా వ్యవసాయ శాఖ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బాల్కొండ వ్యవసాయాధికారి లావణ్య తెలిపారు. అయితే ఈ పథకం కింద రుణమాఫీ కానీ రైతులు తమ కుటుంబసభ్యుల నిర్ధారణ చేయాల్సి ఉంటుందని, అందులో భాగంగా రైతు ఇంటికి వెళ్ళి కుటుంబసభ్యుల పూర్తి వివరాలు రైతు భరోసా యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, అనంతరం దరఖాస్తుదారు నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రామంలో వ్యవసాయాధికారులకు సహకరించి రుణమాఫీ కానీ రైతులు దరఖాస్తు చేసుకోవాన్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

మోర్తాడ్, ఆగస్టు28: మండలంలోని దర్మోరా గ్రామానికి చెందిన కనూరు లక్ష్మీ(42) అనే మహిళ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుందని ఎస్సై విక్రం తెలిపారు. మృతురాలు ఈనెల 4న ఇంటి నుంచి వెళ్ళి దర్మోరా శివారులోని చిన్నవాగులో దూకి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. బుధవారం ఉదయం ఆమె శవంచిన్నాపూర్ బ్రిడ్జి వద్ద తేలిందని గ్రామస్థులు మృతురాలి లక్ష్మీ అని గుర్తించారు. ఆమె కూతురు సంజ్ఞశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై సమావేశం

ఏర్గట్ల,ఆగస్టు 28:మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు ఎలేటి నారాయణరెడ్డి అధ్యక్షతన మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్కన్నగారి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు పలు సలహాలు, సూచనలు తెలిపారు. ప్రతీ ఒక్కరు పార్టీ కోసం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండ ఘనశ్యామ్, గడ్డం శ్రీనివాస్, గుండల విఠల్, ఆనందం గంగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనాలు అందించాలి

● జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్

కమ్మర్‌పల్లి,ఆగస్టు28:విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్న భోజనాలు అందించాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్‌కుమార్ సూచించారు. బుధవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. వంటశాలవద్ద పరిశుభ్రత పాటించాలని, రుచి, సూచకరమైన భోజనాలను విద్యార్థులకు అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థుల భోజనాల విషయంలో ఉపాధ్యాయుల ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను, ఇటీవల పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటిస్తూ, విద్యాబోధన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన సరుకుల స్టాక్‌రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న డిజిటల్ తరగతుల నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి ఆంధ్రయ్య, పాఠశాల హెచ్ఎం పసుపుల సాయన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

● హసాకొత్తూర్ పాలీహౌజ్‌లో ఆర్కిడ్ పూలతోట పరిశీలన

మండంలోని హసాకొత్తూర్ గ్రామశివారులోల మారుతీనగర్ కాలనీలో పాలీహౌజ్‌లో నిర్వహిస్తున్న ఆర్కిడ్ పూలతోటను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్ పరిశీలించారు.ఈసందర్భంగా పూలతోట నిర్వాహకుడు మోహన్ నాయక్ ద్వారా ఆర్కిడ్ పూలతోట పెంపకంలోగల సస్యరక్షణ విధానాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పూల మార్కెటింగ్, మార్కెటింగ్‌లోగల సమస్యలు,పరిష్కార మార్గాలను తెలుసుకున్నారు.కాగా గ్రామంలో రైతులు పండిస్తున్న పంటలు,మార్కెటింగ్ తదితర సమస్యలను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఉద్యానవన శాఖ అధికారి రాజు, రైతులు పడిగెల ప్రవీన్, ఏనుగు మనోహర్,మేడపురమేష్, కిషన్ గౌడ్, తదితర రైతులు ఉన్నారు.

దివ్యాంగులకు నెలకు రూ.6వేల పింఛన్ వెంటనే చెల్లించాలి

● వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ


నవీపేటలో మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత

నవీపేట,ఆగస్టు28: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు నెలకు 6వేల రూపాయల పింఛన్‌ను వెంటనే చెల్లించాలని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అక్కడి తెలుగు దేశం ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు నెలకు 6వేల రూపాయల పింఛన్ చెల్లిస్తుండగా, వృద్ధులు, వితంతువులకు నెలకు 4వేల రూపాయల చొప్పున చెల్లిస్తుందని ఇదే విధానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైతం వెంటనే అమలు చేయాలని ఆమె కోరారు. అలాగే దివ్యాంగులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించడంతో పాటు బ్లాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రాబోయే ఎన్నికలలో దివ్యాంగులకు సైతం రిజర్వేషన్ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. అంతకు ముందు వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మానికోళ్ల గంగాధర్, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షులు బయ్య సతీష్ కుమార్, విజయ్ కుమార్, పంతులు, రాము, వెంకట్, షంషోద్దీన్, లక్ష్మి, శోభ, సాయమ్మ తదితరులున్నారు.

పాడి పశువుల పెంపకంపై శిక్షణ


మాట్లాడుతున్న వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బస్వారెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు28: ఆర్మూర్ పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం మహిళశక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాగ్రామాభివృద్ధి సంస్థ, జిల్లా పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో పాడి పశువుల పెంపకం దారులకు, పౌల్ట్రీ యూనిట్ లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వెటర్నరి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బస్వారెడ్డి మా ట్లాడుతూ ఐకెపీ ఆధ్వర్యంలో శ్రీనిధి పథకంలో రుణాలు తీసుకొని పాడి గేదేలు కొనుగోలు చేసి జీవనోపాధి పొందే లబ్ధిదారులు పాడి పశువుల పెంపకంలో మేళకువలు తెలుసుకోవాలన్నారు. పాడి పశువులను కొనుగోలు చేసే సమ యంలో అధిక పాల దిగుబడిని ఇచ్చే ముర్రా జాతి గేదేలను కొనుగోలు చేస్తే పాల దిగుబడి ఎక్కువగా వచ్చి లాభాలు పొందవచ్చన్నారు. పాడి గేదేల్లో సం క్రమించే వ్యాధులు, నివారణ టీకాలపై అవగాహన కల్పించారు. ఆవులు, పాడి గేదేలు, పెరటి కోళ్ల పెంపకందారులు సరైన జాగ్రత్తలు పాటించి మెరుగైన లాభాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్‌ప్రభాకర్, ఐకెపీ ఏపీఎం, ఐకెపీసిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మోపెడ్ వాహనం లభ్యం


నవీపేటలో లభ్యమైన మోపెడ్ వాహనం

నవీపేట,ఆగస్టు28: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వెనుక వైపున ఎక్సెల్ సూపర్ వాహనం బుధవారం లభ్యమైంది. వాహనం గత రెండు మాసాలుగా బస్టాండ్ ఆవరణలో నిలిపి ఉందని స్థానికులు పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఎవరు కూడా రాకపోవడంతో సంబంధిత సమాచారాన్ని పోలీసులకు అందజేయడం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. గుర్తు తెలియని దొంగలు వాహనం చోరీ చేసి పెట్రోల్ అయిపోవడంతో బస్టాండ్ ప్రాంతంలో వదిలేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.

ఆర్మూర్‌లో కుక్కల దాడి.. పలువురికి గాయాలు

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు28:మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో కుక్కలు దాడులు చేయగా పలువురికి గాయాలయ్యాయి. పట్టణంతో పాటు మామి డిపల్లి, పెర్కిట్‌లలో కుక్కల అధికంగా ఉండడంతో పిల్లలు పెద్దలు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు పట్టణంలో ఆరేళ్ళ బాలికకు చేతిపై కుక్క దాడి చేసింది. మామిడిపల్లిలో పలువురికి కుక్క దాడి చేయి గాయపర్చింది. అధికారులు మున్సిపల్ పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం


హైదరాబాద్ విమానాశ్రయం నుంచి అంబులెన్స్‌లో తరలివస్తున్న మృతదేహం

మెండోర, ఆగస్టు28: మండలంలోని చాకిర్యాల్ గ్రామానికి చెందిన మండోజి రాజేశ్వర్ ఐదు రోజుల క్రితం గల్ఫ్ దేశం దుబాయిలో మృతి చెందడంతో మృతుని మృతదేహం స్వగ్రామానికి చేరింది. ఈ సందర్భంగా దుబాయిలో రాజేశ్వర్ మృతి చెందిన విషయాన్ని మృతుని కుటుంబసభ్యులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్ళగా దుబాయి ఇండియా ఎంబాసి అధికారులతో మాట్లాడి మృతదేహం స్వదేశానికి రావడానికి కృషి చేశారు. మృతదేహం విమానాశ్రయం నుంచి గ్రామానికి రావడానికి ప్రభుత్వం తరపున అంబులెన్స్ ఏర్పాటు చేశారు. పొట్టకూటి కోసం దేశం కానీ దేశం వెళ్ళి ఇలా విగత జీవిగా వస్తారని అనుకోలేదని కుటుంబసభ్యులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి కుటుంబసభ్యులకు సునీల్‌కుమార్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మోర్తాడ్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

మోర్తాడ్, ఆగస్టు28: మోర్తాడ్ మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం సాయంత్రం మోర్తాడ్ మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయంలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉట్టికొట్టేందుకు పాల్గొన్న యువకులు విఫలమయ్యారు. చివరకు ఒకరిపై ఒకరు ఎక్కి ఉట్టికొట్టారు. దీంతో గ్రామస్థులు హర్షధ్వానాలతో మార్మ్రోగాయి. ఈ సందర్భంగా ఉట్టికొట్టిన యువకులకు బహుమతులు అందజేశారు.

● తొర్లికొండ, అర్గుల్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్, తొర్లికొండ గ్రామాల్లో బుధవారం శ్రీకృ ష్ణాష్టమి వేడుకలను ఇరు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.అర్గుల్‌లో ఉట్టికొట్టి ఆనందోత్సవాల మధ్య కృష్ణాష్టమి వేడుకలు జరు పుకోగా తొరికొండలో కృష్ణాష్టమి వేడుకలను అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్గుల్ వీడీసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, క్యాషియర్ అల్లూరి భాస్కర్‌రెడ్డి, వీడీసీసభ్యులు, తొర్లికొండ ఆలయ కమిటీసభ్యులు, వీడీసీ సభ్యులు, ఇరు గ్రామస్థులు పాల్గొన్నారు.


మోర్తాడ్‌లో ఉట్టికొడుతున్న దృశ్యం

జీవో జారీ.. నిధులేవి మరి!?


హంగర్గ ఫారంలోని ప్రభుత్వ పాఠశాల

కోటగిరి,ఆగస్టు28: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు స్కూల్ ఫెసిలిటి మెంటినెన్స్ పేరుతో ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నట్లు విద్యాశాఖ గత నెల 30వ తేదిన జీవో విడుదల చేసింది. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా విడుదలయ్యే కంపోజిట్ స్కూల్ గ్రాంట్‌కు అదనంగా ఈ నిధులను అందజేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇంత వరకు బాగానే ఉన్న ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలు వేలాది సంఖ్యలో ఉండగా లక్షలాది మంది విద్యార్థులు పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులే అటెండర్‌లుగా మారిన సందర్భాలు ఉన్నాయి. స్కావెంజర్‌లను గత ప్రభుత్వం తొలగించి పారిశుధ్య బాధ్యతలను పంచాయతీలకు అప్పగించింది. ఆ ప్రక్రియ ఎక్కడ సరిగా అమలు కాలేదు. అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల ఖాతాలో మూడు నెలల నిధులను ముందే జమ చేయబోతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ విషయమై ఇప్పటి వరకు ప్రభుత్వం ముందడుగు వేయలేదు. ఈ జీవో వచ్చిన వెంటనే పంచాయతీల పారిశుధ్య సిబ్బంది పాఠశాలల్లో పారిశుధ్య సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా చేతులు ఎత్తేశారు. నిధులు లేకపోవడంతో విద్యార్థులే తరగతుల శుభ్రత వంటి పనులు చేపట్టాల్సి వస్తుంది. ప్రభుత్వ ప్రకటనలతో కొన్ని పాఠశాలల్లో స్కావెంజర్‌లను నియమించారు. వారికి వేతనాలు ఇవ్వాలంటే ఉపాధ్యాయులే భరించాల్సిన పరిస్థితి నెలకొంది. అమ్మ ఆదర్శ కమిటీలు నిధులు మంజూరైన తర్వాతే స్కావెంజర్‌లకు వేతనాలు చెల్లిస్తామని ఓ వైపు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై కోటగిరి ఎంఈవో నాగనాథ్‌ను వివరణ కోరగా పలు పాఠశాలల్లో స్కావెంజర్‌లను ఏర్పాటు చేశామన్నారు. నిధులు వచ్చిన వెంటనే వారికి వేతనాలు చెల్లిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

● మరొకరికి తీవ్రగాయాలు ● నిలిపి ఉన్న లారీని ఢీకొన్న కారు ● మద్యం మత్తు, అతివేగమే కారణం



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు


మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 28:నగర శివారులో తెల్లవారుజామున జరిగిన ఓ రోడ్డు ప్రమాదం ఇద్దరు యువకులను బలి తీసుకుంది. నిజామాబాద్ రూరల్ మండలం శ్రీనగర్ వద్ద బుధవారం ఉదయం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు సంఘటన స్థలంలోనే మృతి చెందగా మరొక యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. సారంగపూర్ నుంచి పాల్దా-జన్నెపల్లికి వెళ్లే రహదారిపై గజానన్ రైస్‌మిల్ వద్ద గత రెండు రోజులుగా రోడ్డుపై గుంతలో దిగబడిన లారీ అక్కడే ఉండటంతో నిజామాబాద్ దుబ్బ నుంచి చిక్లీ వెళ్తున్న షిఫ్ట్ డిజైర్ కారు అతివేగంగా లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు టాప్ మొత్తం ఎగిరిపోయి కారులో ఉన్న ఇద్దరు యువకులు మాక్లూర్ మండలం చిక్లీ గ్రామానికి చెందిన దండ్ల వంశీ (17), నగరంలోని కుమార్‌గల్లిలో ఉంటున్న రాజేష్ (18) సంఘటన స్థలంలోనే మృతి చెందారు. కారు నడుపుతున్న దుబ్బకు చెందిన ఆకాష్‌కు తీవ్ర గాయాలు కావడంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నగరంలోని దుబ్బకు చెందిన ఆకాష్ నగరంలోని ఓ హోటల్‌లో పనిచేస్తుండగా గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఇంటిదగ్గరే ఉండటంతో స్నేహితులు వంశీ, రాజేష్‌లు బయటకు వెళ్దామని తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. వంశీని చిక్లీలో దింపేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై నిజామాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత రెండు రోజులుగా గజానన్ రైస్‌మిల్ వద్ద రోడ్డుపై లారీని నిలిపి ఉంచడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆందోళన నిర్వహించారు. యువకుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని స్థానికులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు వచ్చి వారిని సముదాయించడంతో కొద్దిసేపు పోలీసులకు వారికి వాగ్వివాదం జరిగింది. మితిమీరిన వేగం, యువకులు మద్యం మత్తులో ఉండటం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. కారు టాప్ పూర్తిగా ఎగిరిపోగా ఇంజన్‌తో సహా కారు మొత్తం నుజ్జు నుజ్జు కావడం ప్రమాద తీవ్రతను తెలియజేస్తుంది. సౌత్ రూరల్ సీఐ సురేష్, రూరల్ ఎస్సై ఆరిఫ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను కారులోంచి బయటకు తీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇద్దరి యువకుల ప్రాణాలను బలితీసుకున్న లారీ డ్రైవర్, రైస్‌మిల్ ఓనర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ డిమాండ్ చేశారు.

తాళ్లరాంపూర్ సొసైటీలో పంట రుణాల పంపిణీ


పంట రుణాలను అందజేస్తున్న చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి

ఏర్గట్ల, ఆగస్టు 28: మండలంలోని తాళ్లరాంపూర్ సొసైటీలో బుధవారం 52 మంది రైతులకు 49లక్షల 75వేలు పంట రుణాలను సంఘం చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇట్టి రుణాలకు సహకరించిన జిల్లా బ్యాంక్ అధ్యక్షుడు కుంట రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా రుణాల కోసం సరియైన పత్రాలు అందజేసి సొసైటీలో రుణాలు పొందాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్‌లు, కార్యదర్శి గణేష్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రజలు నడిచేది ఎలా!?


గుంతలు పడ్డ ముచ్కూర్, భీమ్‌గల్‌కు వెళ్లే ప్రధాన రహదారి

భీమ్‌గల్, ఆగస్టు28: భీమ్‌గల్ పట్టణం నుంచి ముచ్కూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిని అనుకుని ఉన్నబడాభీమ్‌గల్ బైపాస్‌రోడ్డు ప్రథ మంలో గుంతల మయమైన నీరు నిలిచి చిన్న కుంటను తలపిస్తుంది. దుర్గంధ భరితంగా మారింది. దీంతో ప్రతినిత్యం ఈ రోడ్డుగుండా నడిచే వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ఆ గుంతలలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గం గుండా తిరిగి ప్రజాప్రతినిధులు ఈ సమస్యకు మార్గం చూపలేకపోతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు గానీ, మున్సిపల్ సిబ్బంది కూడా పట్టించుకోవడం లేదు. మున్సిపల్ సిబ్బంది కూడా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎయిర్‌పోర్టుకు చేరుకున్న జాగృతి నాయకులు



ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలకడానికి వెళ్లిన జాగృతి నాయకులు

సిరికొండ ఆగస్టు 28: ఎమ్మెల్సీ భారత్ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జైలు నుంచి విడుదల హైదారాబాద్ వస్తునందున స్వాగతం తెలుపడానికి జాగృతి నాయకులు హైదరాబాద్ ఏర్‌పోర్టుకు వెళ్లారు. నిజామాబాద్ రూరల్ నియోజక వర్గం కన్వీనర్ మల్లెల సాయి చరణ్ ఆధ్వర్యంలో జాగృతి నాయకులు వెళ్లారు.

డిచ్‌పల్లి: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిన వచ్చి బుధవారం హైధరా బాద్ రావడంతో ఆమెకు స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ రూరల్ నాయకుడు బాజి రెడ్డి జగన్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈకార్యక్రమంలో కృష్ణకుంచల రాజు, పద్మ రావు, సంబారి మోహన్, సాయిచరన్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికేందుకు బుధవారం బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని వెళ్ళారు. అనంతరం ఎమ్మెల్సీ కవితను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బీఆర్ఎస్ నాయకులు కలిసి స్వాగతం పలికారు. మండలంలోని సికింద్రాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. తరలివెళ్ళిన వారిలో మాజీఎంపీపీ కుంచాల విమల రాజు, మాజీ వైస్‌ఎంపీపీ తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అరుణ్‌కుమార్, కార్యకర్తలు ఉన్నారు.

బాల్కొండ పీఆర్టీయూ అధ్యక్షుడిగా శ్రీనివాస్

ముప్కాల్, ఆగస్టు28: బాల్కొండ మండలంలో పీఆర్‌టీయు సమావేశంలో అధ్యక్షుడిగా వేల్పూర్ శ్రీనివాస్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శి గడ్డం ప్రతాప్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా గోపి, కార్యదర్శిగా రాజేశ్వర్, మహిళ ఉపాధ్యక్షురాలిగా విద్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా పీఆర్‌టీయు అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలపై అందరిని కలుపుకొని పోరాడుతామని తెలిపారు.

బ్యాంకు రుణాలు, వసూళ్లపై అవగాహన

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 28:నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన వివిధ బ్యాంకు మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లకు డ్వాక్రా సంఘాల బ్యాంకు రుణాలు, వసూళ్లపై, మహిళా శక్తి కార్యక్రమంపై బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో సాయాగౌడ్ వారికి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో నేషనల్ రిసోర్స్ పర్సన్ రమేష్, ప్రాజెక్టు మేనేజర్ సెర్ప్ వీరమల్లు, వెంకట్, అశోక్ చౌహాన్, మురళీకృష్ణ, రవీందర్, నీలిమా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు మాస్కుల అందజేత



సిబ్బందికి మాస్కులు అందజేస్తున్న కార్పొరేషన్ కమిషనర్

సుభాష్‌నగర్, ఆగస్టు 28:నగర పాలక సంస్థ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మాస్కులను అందజేశారు. నగరంలోని గోల్‌హనుమాన్ సర్కిల్ కార్యాలయంలో నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు మాస్కులను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికుల భద్రత సంక్షేమానికి మొదట ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు కావాల్సిన పనిముట్లను సమకూర్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్మికుల కోసం హెల్త్ క్యాంప్ నిర్వహించేందుకు లయన్స్‌క్లబ్ సహకారం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ లింగం, అడిషనల్ కమిషనర్ శంకర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, జవాన్‌లు తదితరులు పాల్గొన్నారు.

మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్



మొక్కలు నాటుతున్న దృశ్యం

మోపాల్, ఆగస్టు 28: మండలంలోని సిరిపూర్ గ్రామంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు.ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో సిరిపూర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆయిల్ పామ్ పంట వైపు రైతులు మొగ్గు చూపాలని అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున రైతులను ప్రోత్సహిస్తుందని రూ.193 ఉన్న మొక్కను రూ.173లకే రాయితీపై ఇస్తోందని అన్నారు. దీనితో పాటు ఎకరానికి రూ.4200 చొప్పున నాలుగు సంవత్సరాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. డ్రిప్ సబ్సిడీ కింద ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం అందిస్తోందన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు జిల్లా క్రీడాకారులు



సృజన్, నితిన్, రమణ

సుభాష్‌నగర్, ఆగస్టు 28: జాతీయ స్థాయి హాకీ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు నిజామాబాద్ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విశాఖ గంగారెడ్డి, రమణలు తెలిపారు. జిల్లాకు చెందిన అగ్గు మనోజ్, సృజన్, నితిన్‌లు రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభకనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబర్చి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని అన్నారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల కోశాధికారి సురేందర్, అసోసియేషన్ సభ్యులు విద్యాసాగర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, అంజు, జావెద్, ఆరీఫ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన శ్రీకృష్ణ గీతామందిర్ ఉత్సవాలు

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 28: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని నగరంలోని శ్రీకృష్ణ గీతామందిరంలో జరుగుతున్న ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఆలయం లోని శ్రీకృష్ణుని ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నప్రసాదాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని రాధాకృష్ణుల వేషాధారణలు, భక్తి పాటలు ఆలపించిన గాయకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు పే స్కేల్ అమలు చేయాలి

డిచ్‌పల్లి,ఆగస్టు 28: తెలంగాణ యూనివర్సిటీలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు యూజీసీ పేస్కేల్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు టీయూ కాంట్రాక్టు అధ్యపకుల సంఘం అధ్యక్షుడు దత్తహరి, గంగాకిషన్, ఉపేందర్, తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లు తక్షనమే పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని వారు తెలిపారు.

పొతంగల్‌లో ఇసుక వేలం

కోటగిరి,ఆగస్టు28: పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఇసుక వేలంపాట నిర్వహించారు. మండలంలోని సుంకిని రహదారిలో 13ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను తహసీల్దార్ మల్లయ్య మంగళవారం రాత్రి సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకకు వేలంపాట నిర్వహించగా రూ.8,400లకు యాదవ రావు అనే వ్యక్తి దక్కించుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలి

మోపాల్, ఆగస్టు 28: మోపాల్ మండలం బైరాపూర్ గ్రామంలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న మురళి అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రైతులు ఏఈకి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామానికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్యలు వచ్చినప్పుడు లైన్‌మెన్‌కు ఫోన్ చేసిన ప్రతీసారి తమతో వాగ్వాదానికి దిగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని వారు ఏఈని కోరారు.

నిబంధనలకు లోబడి ప్రైవేటు ఆసుపత్రులన్నీ పనిచేయాలి

- జిల్లా అదనపు పాలన అధికారి అంకిత్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్



సిరికొండలో డాక్టర్ అరవింద్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పెద్దబజార్, ఆగస్టు 28: క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌కు అనుగుణంగా నియమనిబంధనలకు లోబడి ప్రైవేటు ఆసుపత్రులన్నీ పనిచేయాలని జిల్లా అదనపు పాలన అధికారి అంకిత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2010 సీజనల్ వ్యాధులపై ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా సమయానికి రిపోర్ట్ చేయడమే కాకుండా డిస్ట్రిక్ రిజిస్ట్రేషన్ అథారిటీ ఆధ్వర్యంలో అన్ని ఆసుపత్రులు రిజిస్ట్రేషన్లు, రినివల్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా ముఖ్యంగా డెంగ్యూ వ్యాధి నియంత్రణలో ప్రైవేటు ఆసుపత్రులన్నీ ప్రభుత్వానికి సహకరిస్తూ రిపోర్ట్‌లను తగిన సమయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయానికి చేరవేయాలని సూచించారు. డెంగీ నిర్ధారణ కోసం కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో కేవలం ఆర్‌డిటి టెస్టుల ద్వారా పరీక్షించిన తర్వాత డెంగ్యూ నిర్ధారణ అయినట్లు తెలియజేస్తారని అన్నారు. డెంగ్యూ నిర్ధారణ కోసం కేవలం ఆర్‌డిటి ద్వారా పరీక్షలు చేయడమే కాకుండా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఎలిసా పరీక్ష నిమిత్తం రిఫర్ చేయాలని ఆ పరీక్ష తర్వాత మాత్రమే డెంగీ నిర్ధారణ అవుతుందన్నారు. జిల్లాలో రోజురోజుకు కొత్తగా డెంగీ కేసులు నమోదు అవుతున్న తరుణంలో అన్ని ఆసుపత్రుల వైద్యులు తప్పకుండా దీనిపై దృష్టిసారించి డెంగ్యూ నోటిఫికేషన్‌ను తొందరగా డిఎంహెచ్‌వో కార్యాలయానికి తెలియజేయాలన్నారు. డెంగీ కేసులు నమోదైన ఏడు ప్రైవేటు ఆసుపత్రులను డెంగీ నిర్ధారణ ఆర్‌టిడి, ఎలీసా పరీక్షలపై ప్రత్యక్షంగా సమీక్షించడం జరిగిందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను, ధరల పట్టికను వైద్యుల, సిబ్బంది యొక్క సమాచారాన్ని ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కీటక జనతా వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, జిల్లా టీకాల అధికారి డాక్టర్ అశోక్, డబ్ల్యుహెచ్‌వో, సర్వేలైన్స్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అతుల్‌నెగ్గి, ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు వైద్యులు దామోదర్‌రావు, శ్రీశైలం, డిప్యూటీడీఎంహెచ్‌వో డాక్టర్ అంజన, డీఎల్ఎస్ స్వామి, జిల్లాలోని ప్రైవేటుఆసుపత్రి వైద్యులు,మేనేజ్‌మెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

- గ్రామాల్లో టెస్టులు పెంచండి

సిరికొండ:గ్రామాల్లో డెంగీ కేసులు పెరుగుతున్నందున టెస్టులు పెంచి సర్వేలు కూడ చేయించాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ వైద్యాధికారి అరవింద్‌ను ఆదేశించారు. సిరికొండ ఆసుపత్రిని బుధవారం అదనపు కలెక్టర్ ఆకస్మికంగా అందర్శించారు. వైద్యాధికారి డాక్టర్ అరవింద్‌తో అదనపు కలెక్టర్ మండలంలో గాని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో డెంగీ గాని ఇతర సీజనల్ వ్యాధుల తీవ్రత ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. బుధవారం ధర్పల్లి మండల కేంద్రంలో ఒక డెంగీ కేసు నమోదు అయ్యిందని పీహెచ్‌సీ పరిధిలో ధర్పల్లి మండలంలోని మూడు ఆరోగ్య ఉపకేంద్రాలను కలుపుకుని జూలై నుంచి 28 కేసుల వరకు వచ్చినట్లు డాక్టర్ అరవింద్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా అవగాహన కల్పించాలని, సర్వేలు చేయించి చికిత్సలు చేసుకునే విధంగా చూడాలని వైద్యాధికారికి సూచించారు.టెస్టులు కూడ పెంచాలని అదనపు కలెక్టర్ కోరారు. నీళ్ల నిలువకుండా వుండే విదంగా పంచాయతీ కార్యదర్శుల చెప్పాలని ఆయన సూచించారు.దోమల నివారణ కోసం ఫ్యాగింగ్ చేయడంతో పాటు డ్రైనేజీలను శుభ్రం చేయించాల కోరాలని అదనపు కలెక్టర్ వైద్యాధికారి అరవింద్‌ను కోరారు. తాము గ్రామాల్లో ఆశా కార్యకర్తలతో ఎప్పటికప్పుడు సర్వే చేయిస్తున్నట్లు వైద్యాధికారి వివరించారు. మండల పరిషత్ కార్యలయానికి వెళ్లి ఎల్ ఆర్ఎస్ పై సర్వే ఎలా జరుగుతుందో ఎంపీడీవో తారచంద్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు.

సిమెంట్ గద్దెపైకి ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నడిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

డిచ్‌పల్లి,ఆగస్టు 28:మండల కేంద్రంలోని నడిపల్లి పంచాయతీ కార్యాలయం పక్కన గల ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తైన నూతన గద్దె పైకి మార్చాలని 'ఆంధ్రజ్యోతి' మిని ఎడిషన్‌లో వార్త ప్రచురించడంతో ట్రాన్స్‌కో ఏఈ సాయిలు స్పందించి బుధ వారం సిమెంట్ గద్దెపైకి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. ప్ర మాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గద్దెపై బిగించడంతో స్థానికులు ,పంచాయతీ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. చేతికి అందే ఎత్తు లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను నూతనంగా నిర్మించిన గద్దెపైకి మార్చేందుకు చర్యలు తీసుకున్న ఏఈ సాయిలుకు స్థానికులు, గ్రామస్థులు అభినందనలు తెలి పారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి

- సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకుడు రామకృష్ణ



ధర్పల్లిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న దృశ్యం

ధర్పల్లి, ఆగస్టు 28: మండల కేంద్రంలో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను వెంటనే నిరుపేదలకు అందజేయాలని సిపిఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో గ్రామానికి చెందిన నిరుపేదలతో కలిసి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిరుపేదలకు పంపిణీ చేయాలన్నారు. నిరుపేదలు తమకల నెరవేరుతుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తే వారికి నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ నాయకులు రమేష్, దామోదర్, అశీష్, విలాస్, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

టీయూ బయోటెక్నాలజీ విభాగాధిపతిగా ప్రసన్నశీల



ప్రసన్న శీలకు నియామకం అందజేస్తున్న రిజిస్ట్రార్

డి చ్ పల్లి,ఆగ స్టు 28:తె లంగాణ యూనివర్సిటీలో బయోటెక్నాలజీ విభాగాధిపతిగా ప్రసన్నశీలను ఇంచార్జ్ వీసీ సందీప్‌కుమార్ సుల్తానీయ ఆదేశాల మేరకు నియమించినట్లు రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి తెలిపారు.ఈ మేరకు ఆమెకు నియామక పత్రం అందజేశారు. ప్రస్తుతం ప్రసన్న శీల జువాలజీ విభాగాధి పతిగా వ్యవహరిస్తున్నారు. గతంలో అడిష నల్ కంట్రోలర్,ఉమెన్‌సెల్ డైరెక్టర్, అకాడమిక్ అడ్మిని స్ట్రేషన్ పదవులు నిర్వర్తించారు.జాతీయ అంతర్జాతీ ఇంపాక్ట్ ప్యా క్టర్ జనరల్స్‌లో వర్తమానఅం శాలపై పుస్తకాలు ప్రచురించారు.

- టీయూలో 30న కెమిస్ట్రీ విభాగంలో జాబ్ మేళా

టీయూ వీసీ, రిజి స్ట్రార్‌ల ఆదేశాల మేరకు వర్సిటీలో 2022,2023,2024 సంవత్సరం లో పీజీ పూర్తి చేసిన వర్సిటీ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్య ంలో హెటిరో డ్రగ్స్ వారి ప్లెస్‌మెంట్ ను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు డా. అడి కే నాగరాజు ఒక ప్రకటనలో తెలి పారు. ఈడ్రైవ్‌లో ఎంఎస్సీ కెమిస్ట్రీ, బయో టెక్నా లజీ ఎంఎస్సీ మైక్రోబయోలజీ, జనటిక్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్ విద్యార్థులు అర్హులని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల ర్యాలీ, దీక్ష

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 28: తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సమగ్రశిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం ఆందోళన నిర్వహించారు. నగరంలోని పాలిటెక్నిక్ మైదానం నుంచి ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ధర్నాచౌక్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు.సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. తక్కువ జీతాలతో తమకుటుంబాలను పోషించడం ఇబ్బందికరంగా మారుతుందని తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.కనీస వేతనం ఇవ్వాలని,హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరారు.ఈకార్యక్రమంలో దిలీప్, రాజు, విజయ్, ఉద్యోగులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మోపాల్‌లో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

మోపాల్, ఆగస్టు 28: కేజీబీవీ,యూఆర్ఎస్ మోడల్ స్కూల్ హాస్టల్‌లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బందికి బేసిక్‌పే అమలు చేయాలని ఈనెల 30న చేపట్టనున్న చలో ఎస్‌పీడీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఆవిష్కరించారు. ఈ పాఠశాలలో పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు అమలు చేయడం లేదని, ఖాళీలు భర్తీ చేయడం లేదని అన్నారు. కాలేజీలు అప్‌గ్రేడ్ అయినా కేజీబీవీలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలన్నారు. రిటైర్డ్‌మెంట్ వయస్సును 65 ఏళ్లకు పెంచాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ కూడా ఇవ్వాలన్నారు. ఉద్యోగ ఆరోగ్య భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. డ్యూటీ చార్ట్ అమలు చేసి పనిభారాన్ని తగ్గించాలన్నారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోసం 30న చేపడుతున్న చలో ఎస్‌పీడీ కార్యాలయ కార్యక్రమాన్ని సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో నాన్‌టీచింగ్ స్టాఫ్ సుమలత, లక్ష్మి, పుష్పలత, ప్రేమ, వాసూకి, సంతోషి, సుజాత, సరోజ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా సుద్దపల్లి వాసి నియామకం

డిచ్‌పల్లి,ఆగస్టు 28: భారతీయ జనత పార్టీ సంస్థగత నిర్మాణంలో భాగంగా జిల్లా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన పానుగంటి సతీశ్ రెడ్డిని బుధవారం నియామిస్తూ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులచారి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ,బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, సూచనల మేరకు ఈ నియామకం చేసినట్లు జిల్లా అధ్యక్షుడు తెలిపారు. తనపై విశ్వాసంతో జిల్లా బీజేవైఎం అధ్యక్షుడిగా నియచేందుకు సహకరించినందరికి ధన్యవాదలు తెలిపారు. సతీష్ నియామకంతో సుద్దపల్లిలో బీజేపీ కార్యకర్తలు బాణా సంచా కాల్చి సంబరాలు నిర్వహించుకున్నారు.

ఏకకాలంలో రెండులక్షల రుణమాఫీ చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

నిజామాబాద్ అర్బన్,ఆగస్టు28:రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ఎలాంటి షరత్తులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ రుణమాఫీ కావడం లేదని గత ప్రభుత్వ హయాంలో అయిన వారికే రుణమాఫీ అవుతుందని కొత్తవారికి కావడం లేదన్నారు. అనేక కారణాలుచూపుతూ బ్యాంకర్లు రుణమాఫీ చేయడం లేదని ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో ఎలాంటి షరత్తులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్‌కుమార్, అంబిక సత్యనారాయణ, రాజు,హైమద్, రాములు, గోవర్ధన్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఖిల్లా, ఆగస్టు 28: జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆసుపత్రి సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు ఆసుపత్రికి చేరుకొని వైద్యులచే పరీక్షించగా మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు. మృతుడు సుమారు 5 అడుగుల ఎత్తు ఉంటాడని చామన చాయ రంగు కలిగి, షర్ట్ బ్లూకలర్, ప్యాంట్ నలుపు, తెలుపు రంగు జుట్టు, గడ్డం కలదని, బట్టతలతో ఉన్నాడని అన్నారు.ఆయన వద్ద ఎటువంటి ఆ ధారాలు దొరకలేదని మృతుడికి సంబంధించిన వారు ఉన్నట్లయితే ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. సంప్రదించాల్సిన నెంబర్లు 8712659837, 8712659714 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు ఇంటర్మీడియట్‌లో స్పాట్ అడ్మిషన్లు

సిరికొండ ఆగస్టు 28: సుద్దపల్లిలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియేట్ మొదటి ఏడాదిలో ఎంపీసీ,బైపీసీలో మిగిలి పోయిన సీట్లకు గురువారం(29న) స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రిన్స్‌పాల్ నళిని ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో ఎస్సీలకు రెండు సీట్లు, బైపీసీ ఒకటి ఎస్సీ, మరొకటి బీసీలకు సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్స్‌పాల్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఒర్జినల్ సర్టిఫికెట్ల గురువారం ఉదయం పది గంటలకు సుద్దపల్లి కళాశాలకు హాజరు కావాలని ప్రిన్స్‌పల్ నళిని కోరారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74400	రూ.68,600	రూ.900

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

- స్క్రీన్-1 : సరిపోదా శనివారం (9.00, 12.30, 4.00, 7.30, 11.00)
- స్క్రీన్-2 : స్త్రీ-2 (హిందీ) (12.00, 3.15, 6.30, 9.45)
- స్క్రీన్-3 : కాలం రాసిన కథలు (10.05)
  - : కమిటీ కుర్రాళ్లు (1.00, 10.40)
  - : తంగాలన్ (4.15)
  - : అయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.35)
- స్క్రీన్-4 : డిమోంటి కాలనీ-2 (12.50, 10.10)
  - : అయ్ మేం ఫ్రెండ్స్ అండి (3.55)
  - : మారుతినగర్ సుబ్రమణ్యం (7.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : సరిపోదా శనివారం (10.10, 1.15, 4.20, 7.30, 10.40)
- స్క్రీన్-2 : మారుతినగర్ సుబ్రమణ్యం (10.30)
  - : కమిటీ కుర్రాళ్లు (1.30, 10.30)
  - : డిమోంటి కాలనీ-2 (4.30)
  - : స్త్రీ-2 (హిందీ) (7.30)
- స్క్రీన్-3 : అయ్ మేం ఫ్రెండ్స్ అండి (10.35, 4.30, 10.15)
  - : తంగలాన్ (1.30, 7.15)

- దేవి : తంగలాన్ (11.15, 2.15, 6.15, 9.15)
- నటరాజ్ : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : మిస్టర్ బచ్చన్ (11.15, 2.15, 6.15, 9.15)
- లలితామహల్ : డబుల్ ఇస్మార్ట్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్